
సాక్షి పల్నాడు

శనివారం । 1 । జూన్ । 2024



నాగవల్లీ దళార్చన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పాతగుంటూరు విశాఖ శ్రీశారదా పీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం లక్ష నాగవల్లీ దళార్చన చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

హనుమాన్‌కు ఫల, పుష్పాలంకరణ



సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఉన్న భక్తాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి పంచామృత అభిషేకాలు, హనుమత్ హోమం, విశేష ఫల పుష్పాలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

ఘనంగా గుంటి ఆంజనేయ స్వామి వార్షికోత్సవం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి 44వ వార్షికోత్సవం, హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి అష్టోత్తర శత కలశ అభిషేక స్నాపన, తిరుమంజనం, హోమాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవం చివరి రోజు శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు, హనుమత్ వ్రత మహోత్సవాలు, ఉంటాయని అర్చకులు శ్రీమన్నారాయణ జయచంద్, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

ముగిసిన పది సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేటఈస్ట్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 23 పరీక్ష కేంద్రాలలో శుక్రవారం 1,963 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 1,133 మంది హాజరయ్యారు. మరో 830 మంది గైర్హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పరీక్షలు సజావుగా సాగేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను, సిబ్బందిని అభినందించారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ఫ్యాన్లు, ఇతర మౌలిక వసతులను కల్పించామన్నారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 246 మంది



గుంటూరుఎడ్యుకేషన్:పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలనకు శుక్రవారం 246 మంది విద్యార్థు లు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. శనివారం జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 75,001 నుంచి 92 వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

‘బంగారు’ చంద్రిక

పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ



మంగళగిరి: పట్టణంలోని ఈద్గా మైదానంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ మెన్, ఉమెన్ బెంచ్ ప్రెస్–2024 పోటీలు శుక్రవారం ముగిశాయి. మహిళా విభాగంలో పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక రెండు బంగారు పతకాలను సాధించింది. 560 కేజీల విభాగంలో స్క్వాట్ 252.5కేజీలు, బెంచ్ ప్రెస్ 107.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 200 కేజీల విభాగాలలో రెండు బంగారు పతకాలు సాధించిన చంద్రికను అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని, సకల కోటేశ్వరరావు, ఎస్.సి.మోహన్, మద్దె ప్రభాకర్ తదితరులు అభినందించారు.

ఢిల్లీ ఎయిమ్స్ ఫలితాల్లో డాక్టర్ వినీతకు ఫస్ట్ ర్యాంకు



గుంటూరు మెడికల్: ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) న్యూఢిల్లీ వారు సూపర్ స్పెషాలిటీ పీజీకి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు డాక్టర్ కన్నెగంటి వినీత రుమటాలజీ విభాగంలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. డాక్టర్ వినీత ఎయిమ్స్‌లోనే ఎంబీబీఎస్ పూర్తి చేసి జనరల్ మెడిసిన్ పీజీని చండీఘ డ్‌లోని పోస్టుగ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ మెడికల్ అండ్ రీసెర్చ్‌లో పూర్తి చేశారు.

అంతటా ఉత్కంఠ

- సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సర్వత్రా చర్చ
- ఏ నలుగురు కలిసినా అవే ముచ్చట్లు
- ఐదేళ్ల జగనన్న పాలనతో ధీమాగా ఉన్న వైఎస్సార్ సీపీ
- కాకిలెక్కలేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- సాయంత్రం వెలువడే పోస్ట్ పోల్ సర్వేల కోసం ఎదురుచూపులు
- కౌంటింగ్ రోజు నరసరావుపేటలో హోటల్స్ ఫుల్
- ఏజెంట్లు, ముఖ్యనేతల కోసం అభ్యర్థులు ముందస్తు బుకింగ్
- అల్లర్ల నేపథ్యంలో యజమానులపై పోలీసుల ఆంక్షలు



సాక్షి, నరసరావుపేట: ఏ ఒక్కరి నోట విన్నా ఒక్కటే మాట.. ఏంటి పరిస్థితి, ఎన్ని రావొచ్చు..? ఎదురుగా కనపించిన వారిని, ఎక్కడో దూరంగా ఉన్న వారితో ఫోన్ సంభాషణలో అడుగుతున్న ప్రశ్న ఇది. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మే 13వ తేదీ ముగియగా అప్పటి నుంచి రకరకాల పోలింగ్ బూత్‌ల వారీగా ఎన్ని ఓట్లు పోలయ్యాయి, వైఎస్సార్ సీపీ, టీడీపీకి ఎన్ని ఓట్లు వచ్చాయో, బూత్‌ల వారీగా లెక్కలు తెప్పించుకొంటున్నారు. ఇరు పార్టీలు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. గెలుపు అంచనాలు వేసుకుంటూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు గంటల తరబడి క్యూలో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగింది. ఈ వర్గాలు ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నాయో ఆ పార్టీదే విజయం అనే చర్చ ప్రధానంగా జరుగుతోంది. ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని, వారి ఆదరణతో మరోసారి గొప్ప విజయం సాధిస్తామని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. మరోవైపు టీడీపీ నేతలు మాత్రం నెగిటివ్ ప్రచారాన్నే నమ్ముకొని కాకి లెక్కలు వేసి ఆత్మ సంతృప్తి చెందుతున్నారనే అభిప్రాయం ఎక్కువగా వస్తోంది. కొందరు టీడీపీ నేతలు మాత్రం మరోసారి జగన్ ప్రభుత్వమే వస్తోందని, కావాలనే కొందరు కూటమి గెలుస్తోందన్న ప్రచారం విపరీతంగా చేసి కార్యకర్తలు ఆర్థికంగా నష్టపోయేలా చేస్తున్నారని వాపోతున్నారు.

పోస్ట్ పోల్ సర్వేలపై ఆసక్తి...

లోక్‌సభ ఎన్నికల తుది దశ పోలింగ్ శనివారం సాయంత్రం 6 గంటలకు ముగియనుండటంతో ఎన్నికల సంఘం ఎగ్జిట్, పోస్ట్ పోల్ సర్వేలపై విధించిన ఆంక్షలు ముగియనున్నాయి. పలు వార్త సంస్థలు, సర్వే సంస్థలు తమ సర్వే అంచనాలను విడుదల చేయనున్నాయి. వీటి కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీటితో కొంత ప్రజల నాడీ తెలుసుకొనే అవకాశం ఉందన్న భావనలో రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు ఉన్నారు. ఆరా సంస్థ డైరెక్టర్ షేక్ మస్తాన్ తన స్వగ్రామం చిలకలూరిపేట మండలం మద్దిరాలలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి ఎన్నికల ఫలితాల అంచనాలను విడుదల చేయనున్నారు.

నరసరావుపేటలో మకాం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ నరసరావుపేట సమీపంలోని జేఎన్‌టీయూ కళాశాలలో జరగనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా కేంద్రంలో హడావుడి మొదలైంది. జిల్లాలోని పార్లమెంట్, ఏడు నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు, ముఖ్యనేతలు, అనుచరులు జూన్ 3వ తేదీనే నరసరావుపేటకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు పట్టణంలోని హోటళ్లలో ముందుగానే బుకింగ్ చేసుకుంటున్నారు. మరోవైపు కొందరు ఔత్సాహికులు హోటళ్లలో గదులు తీసుకొని ఏసీ గదుల్లో టీవీల ముందు కూర్చొని ఫలితాలు ఎప్పటికప్పుడు తెలుసుకుందామని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో ఇప్పటికే ప్రధాన హోటళ్లలో గదులు పూర్తిగా బుకింగ్ అయ్యాయని సమాచారం. ఒక్కో అభ్యర్థి తమకు అనుకూలంగా ఉన్న హోటల్‌ను పూర్తిగా బుకింగ్ చేసుకున్నారు. పోలింగ్ రోజు, తరువాత జిల్లాలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో జిల్లాలో శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచే 144 సెక్షన్ పూర్తిగా అమలు చేస్తామని, దుకాణాలన్నీ బంద్ చేయాలని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు లాడ్జిలోకి నేరస్వభావం ఉన్న వారు వచ్చి గదులు తీసుకుంటే మరోసారి ఘర్షణలు జరిగే ఆస్కారం ఉన్న నేపథ్యంలో పోలీసులు నిఘా పెంచారు. గదులు తీసుకునే వారి సమాచారం ఇవ్వాలని, సీసీ కెమెరాలు విధిగా పనిచేసేలా చూడాలని ఆదేశాలు ఇస్తున్నారు. వ్యక్తుల సమాచారం సేకరించాలని అనుమానాస్పద వ్యక్తులు, మారణాయుధాలను గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని హోటల్ యజమానులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.

విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే జైలుకే..

- జిల్లా ఎస్పీ మలికా గార్గ్
- అడ్మిన్‌లదే బాధ్యత
- ఎగ్జిట్‌పోల్ ఫలితాలపై అప్రమత్తమైన పోలీసులు
- నేటి సాయంత్రం నుంచి వ్యాపార సంస్థలు మూసేయాలి

నరసరావుపేట: సోషల్ మీడియాలలో విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరించారు. ఈ నేరాలలో గ్రూప్ అడ్మిన్‌లదే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నరసరావుపేట టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక వ్యక్తి మరొక వ్యక్తిని అసభ్యకరంగా తిడుతూ, రాజకీయ పార్టీల గురించి ప్రస్తావిస్తూ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో వీడియో పెట్టాడని, వచ్చిన రిపోర్టుపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారన్నారు. ఆ వ్యక్తిని అరెస్టు చేసి కోర్టు ద్వారా రిమాండ్‌కు పంపామన్నారు. శనివారం వెలువడే ఎగ్జిట్ పోల్స్‌పై ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు సోషల్ మీడియా, వాట్సాప్‌లలో పెట్టరాదని అన్నారు. ఎవరైనా అటువంటి సందేశాలు, ఫొటోలు, వీడియోలు పంపితే గ్రూప్ అడ్మిన్స్‌దే పూర్తి బాధ్యత అని తెలియజేస్తూ, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్తెనపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక రౌడీషీటర్, ఒక రాజకీయ పార్టీ ఆఫీసు వాచెమన్‌పై దాడిచేసి చేతులతో కొట్టి పార్టీ ఆఫీసును తగుల పెడతానని బెదిరించిన విషయమై కేసు నమోదు చేసి అతనిని అరెస్టుచేసి జైలుకు పంపామని తెలిపారు. ఈ విషయమై నేర చరిత్ర ఉన్న ఏ ఒక్కరైనా అదుపు తప్పి ప్రవర్తిస్తే, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై పీడీ యాక్ట్ పెట్టడంతోపాటు, అవసరమైతే జిల్లా బహిష్కరణ కూడా చేస్తామని అన్నారు.

హనుమాన్ జయంతిని దేవాలయాల్లోనే నిర్వహించుకోవాలి

జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున హనుమాన్ జయంతి సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో ఎటువంటి ర్యాలీలు, మైకులకు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతిలేదని, భక్తులు దేవాలయాల్లో మాత్రమే స్వామి వారికి పూజలు నిర్వహించుకొని సహకరించాలని కోరారు. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని వాణిజ్య, వ్యాపార కార్యక్రమాలను (షాపులు)మూసివేసి వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలు ఎక్కడ గుమికూడరాదని ఏదైనా అత్యవసరమైతేనే బయటికి రావాలని, కావాల్సిన సరుకులు, ఇతర వస్తువులు సమకూర్చుకొని ఇంట్లోనే ఉంటూ శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

నేటి నుంచి దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) పదవ తరగతి, ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు నాలుగు పరీక్ష కేంద్రాలలో 941 మంది విద్యార్థులు, ఆరు పరీక్ష కేంద్రాలలో 1,279 మంది ఇంటర్మీడియేట్ విద్యార్థులు హాజరు కానున్నట్టు వివరించారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ అధ్యయన కేంద్రాలలో హాల్ టికెట్లను తీసుకొని పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు. పరీక్ష ప్రారంభానికి ముందే కేంద్రానికి చేరుకోవాలని, మధ్యాహ్నం 2.30 గంటల తరువాత విద్యార్థులను పరీక్ష కేంద్రంలోని అనుమతించటం జరగదని స్పష్టం చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు వారి వారి పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, ఫ్యాన్లు, ఇతర ఫర్నిచర్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారుల సహకారంతో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. పరీక్ష జరిగే సమయంలో ఆయా కేంద్రాల పరిసరాల్లో పోలీస్‌శాఖ సహకారంతో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తే కౌంటింగ్ విజయవంతం

- కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్
- కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్, వేదికపై ఎస్పీ మలికా గార్గ్, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎనికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో ఎస్‌హెచ్‌ఓలు, రిటర్నింగ్, మండల రెవెన్యూ అధికారులతో జూన్–4న జరిగే ఎన్నికల కౌంటింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఏదైనా సంఘటన జరిగితే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. అలసత్వం వదలి బాధ్యతగా పనిచేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ రోజున జరిగిన సంఘటనల వలన పల్నాడు జిల్లా ప్రాచుర్యం పొందిందన్నారు. అందరం కలసి సమన్వయంతో, తటస్థంగా విధులు నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో రెవెన్యూ, పోలీసు శాఖ లు అభ్యర్థులు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి తప్పుచేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, ఎన్నికల ప్రక్రియలో కేసులు నమోదైతే అవి త్వరితగతిన పరిష్కారం కావనే విష యం తెలియచేయాలన్నారు. ఏ విషయంపైన అయినా వెంటనే స్పందించి వేగంగా పరిష్కరించేలా ఉండాలన్నారు. ఎగ్జిట్ పోల్, ఫలితాల అనంతరం అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించిన విషయాలు వెంటనే మీడియాకు అందజేయాలని తెలిపారు. బైండోవర్ కేసులపై యా క్షన్ తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, కూడళ్లపై అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

బైండోవర్ కేసులపై చర్యలు తీసుకోండి

ఎస్పీ మలికా గార్గ్ మాట్లాడుతూ బైండోవర్ కేసులపై తక్షణ చర్యలు తీసుకొని నగదు చెల్లించని వారిని అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ఈనెల మూడో తేదీ రాత్రి, నాల్గవ తేదీ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలు సృష్టించే వారిని గుర్తించి వారిని బైండోవర్ చేయాలన్నారు. పరారీలో ఉన్న వారిని జిల్లాలోకి అనుమతించవద్దని తెలిపారు. లూజ్ పెట్రోలు, బాణసంచా అమ్మకాలకు అనుమతి లేదని, పోలీస్, రెవెన్యూ శాఖ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నిబంధనలు ఉల్లంఘించిన వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని సూచించారు. జేసీ ఏ.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సమాచార వ్యవస్థ పటిష్టంగా ఉండాలని సూచించారు. బైండోవర్ కేసులను స్టడీ చేయాలన్నారు.

మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు

కౌంటింగ్ సెంటర్లలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి.లత్కర్ అన్నారు. శుక్రవారం కలక్టర్ కార్యాలయంలోని ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌంటింగ్ సెంటర్‌లో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అవసరమైన ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటుతోపాటు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కౌంటింగ్ సెంటర్లో హై స్పీడ్ అంతర్జాల సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బందికి బస్ సౌకర్యం కలిప్చించాలన్నారు. 108 అంబులెన్స్ సర్వీస్ అందుబాటులో ఉంచాలన్నారు. మొబైల్ డిపాజిట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

బంగరు ‘భవిత’కు బాటలు

- భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాబుద్ధులు
- జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అధికారులు, సిబ్బంది
- ఇప్పటి వరకు 322 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సర్వే నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

చిలకలూరిపేట: ప్రత్యేక అవసరాలుగల పిల్లల బంగారు భవితకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పిల్లలు చదువుకు దూరం కారాదని ఉద్దేశంతో ఇంటింటా సమగ్ర సర్వే నిర్వహిస్తోంది. పల్నాడు జిల్లాలో ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించి వారిని బడిబాట పట్టించే దిశగా సమగ్ర శిక్ష ప్రాజెక్టు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. సరైన అవగాహన, చైతన్యం లేక నాలుగు గోడలకే పరిమితమై, చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. సహిత విద్య రిసోర్స్‌పర్సన్‌లు పట్టణాలు, గ్రామాల్లోని సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో ఇంటింటికి వెళ్లి ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తిస్తున్నారు.

శరవేగంగా సర్వే

ఇప్పటికే ప్రారంభమైన ప్రత్యేక అవసరాలుగల పిల్లల గుర్తింపు సర్వే జిల్లాలో శరవేగంగా కొనసాగుతోంది. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన ఈ సర్వే వచ్చే నెల జూన్ తొమ్మిదో తేదీ వరకు కొనసాగుతుంది. ఇప్పటి వరకు పాఠశాలల్లో చేరని పిల్లలతోపాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 322 మందిని గుర్తించారు. చదువుల వల్ల ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, రాయితీల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి వారిని బడిబాట పట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. సమగ్ర శిక్ష ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు విభిన్న ప్రతిభావంతుల బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలుస్తున్నాయి.

జిల్లాలో 322 మంది గుర్తింపు

జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాబోధన కోసం 28 భవిత కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. జిల్లాలో మొత్తం 3,113 మంది ప్రత్యేక అవసరాలుగల పిల్లలు ఉన్నారు. వీరిలో 345 మంది గత ఏడాది భవిత కేంద్రాల్లో చేరి విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటి వరకు తాజాగా 322 మంది ప్రత్యేక అవసరాలుగల వారిని గుర్తించారు. వీరిని భవిత కేంద్రాల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తారు. ఇందు కోసం ప్రత్యేక శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్‌లు భవిత కేంద్రానికి ఇద్దరు చొప్పున జిల్లాలో 56 మంది పాఠాలు బోధిస్తారు. వీరికి తోడు 28 కేంద్రాల్లో 28 మంది ఆయాలు అందుబాటులో ఉంటారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే క్రమంలో 19 మంది ఐఈడీఎస్ఎస్‌లు అందుబాటులో ఉన్నారు. ఫిజియోథెరఫీ వైద్యులు ఆరుగురు అందుబాటులో ఉన్నారు.

భవిత కేంద్రాలతో ప్రయోజనాలు

సమగ్ర శిక్ష ద్వారా ఈ ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఎన్నో సదుపాయాలు, వసతులు, రాయితీలు, రవాణా చార్జీలను అందిస్తూ ఉచిత విద్యను అందించేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబుల్డ్ యాక్ట్ 2016 ద్వారా 21 రకాల వైకల్యాలను గుర్తించారు.

- భవిత కేంద్రాల్లో వారానికి ఒకరోజు చొప్పున అవసరమైన పిల్లలకు ఫిజియోథెరఫీ చేయిస్తారు.
- ప్రవేశాలు పొందిన బాలబాలికలకు భవిత కేంద్రాల ద్వారా ఉచిత పరికరాల పంపిణీకి వైకల్య నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు.
- భవిత కేంద్రాల్లో చేరిన వారికి రూ.25 వేలు విలువ చేసే ట్యాబ్‌లు అందజేస్తారు. రూ.10వేల విలువ చేసే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్లు పంపిణీ చేస్తారు.
- ఒక్కో కిట్‌లో రూ.1500 నుంచి రూ.15వేలు ఖరీదు చేసే ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారు. భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు నెలకు రూ. 300 చొప్పున ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ ఇస్తారు.
- నడవలేని విద్యార్థులను స్కూల్‌కు తీసుకువచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ అందజేస్తారు.
- ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు వారికి స్టైఫండ్ అందిస్తారు.
- చదవలేని విద్యార్థులకు చదివి వినిపించే వారికి రీడర్ అలవెన్స్‌గా రూ.300 అందజేస్తారు.
- సదరం సర్టిఫికెట్స్ జారీ చేయించి ప్రభుత్వ పెన్షన్లు, రాయితీలు వచ్చేలా చూస్తారు. అలాగే ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కూడా వర్తింప చేస్తారు.


పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్చాలి...



ప్రత్యేక అవసరాలుగల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించటం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు పొందగలుగుతారు. జాతీయ ఉపకార వేతనం కింద ఏడాదికి రూ.9వేల నుంచి రూ.11 వేల వరకు మంజూరవుతాయి. వీటికి తోడు పింఛన్లు, రాయితీలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, అలవెన్సులు, ఉచిత ఉపకరణాలు ఇలా ప్రతి ఒక్కటి ప్రభుత్వమే అందజేస్తుంది. వైకల్యం ఉందని బాధపడకుండా పిల్లలను బడులకు పంపాలి. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై ముందుగా పిల్లల తల్లిదండ్రుల్లో చైతన్యం రావాలి.

–కె శ్రీనివాసరావు,
సహిత విద్య ఇన్‌చార్జి కోఆర్డినేటర్, సమగ్రశిక్ష పల్నాడు జిల్లా

సాధారణ విద్యార్థులతో సమానంగా...



సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది. ప్రజల్లో సరైన అవగాహన లేక ప్రత్యేక అవసరాలుగల పిల్లల తల్లిదండ్రులు వీటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. అంకవైకల్యంతో పుట్టిన తమ పిల్లలను నాలుగు గోడల మధ్యకే పరిమితం చేస్తున్నారు. ఇలాంటి వారందరిని పాఠశాలల్లో చేర్పేందుకు విస్తృతంగా ఇంటింటి సర్వే చేస్తున్నాం.

–విశ్వప్రసాద్,
ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్, చిలకలూరిపేట

పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్, గుండెజబ్బులు

పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ



డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ర్యాలీ

నరసరావుపేట: పొగాకు ఉత్పత్తుల వాడకంతో క్యాన్సర్, గుండె జబ్బులు వస్తాయని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి నిర్వహించిన ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ధూమపానం చేసేవారికి బీసీజీ వ్యాక్సిన్ వేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్, సీడీఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజరాజేశ్వరి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రత్నాకర్, డీసీఎం ఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్య మృతి కేసులో భర్తకు జైలు

నరసరావుపేటటౌన్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఏ.పూర్ణిమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ప్రకారం.. ఫిరంగిపురానికి చెందిన షేక్ మాబినాతో అదే గ్రామానికి చెందిన షేక్ గౌస్‌కు 2007 ఏప్రిల్ 29న వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిసైన భర్త అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేశాడు. ఈ క్రమంలో 2019 నవంబర్ 10న మాబినా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తన సోదరి మృతికి భర్త వేధింపులే కారణమని మృతురాలి అన్న ఇచ్చిన ఫిర్యాదు ఫిరంగిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పింది.

లారీ డ్రైవర్ ఆకస్మిక మరణం


కల్యాణ్ సింగ్ (ఫైల్)

మార్టూరు: ఎక్కడో పుట్టి మార్టూరుకు చేరుకున్న ఓ వ్యక్తి నిద్రలోనే తిరిగిరాని శాశ్వత లోకాలకు చేరుకున్న విషాదకర ఘటన శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. ఏఎస్ఐ మెహబూబ్ బాషా వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన జంగా శ్రీనివాసరెడ్డికి చెందిన లారీపై ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లలిత్‌పూర్ జిల్లా చిట్వాన్ గ్రామానికి చెందిన కల్యాణ్ సింగ్ (40) గత మూడేళ్లుగా డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఆగ్రా నుంచి బంగాళాదుంపల లోడుతో మార్టూరు కూరగాయల మార్కెట్‌కు గురువారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో చేరుకున్నాడు. అనంతరం కల్యాణ్ సింగ్ లారీని అన్‌లోడ్ కు ఉంచి మార్కెట్‌లోనే నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం ఉదయం 7 గంటలకు అన్‌లోడ్ అయిన తరువాత లారీ క్లీనర్ మానిటండ్ డ్రైవర్ కల్యాణ్ సింగ్‌ను నిద్ర లేపే ప్రయత్నం చేశాడు. అచేతనంగా పడిఉన్న అతడ్ని గమనించిన మానిటండ్ స్థానికులతో పాటు లారీ ఓనర్ శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. గుంటూరు నుంచి వచ్చిన లారీ యజమాని శ్రీనివాసరెడ్డి ఇచ్చిన సమాచారంతో ఏఎస్ఐ మార్కెట్‌కు చేరుకుని కల్యాణ్ సింగ్‌ను గమనించారు. అతను నిద్రలోనే మరణించినట్లు గుర్తించి మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గుండె పోటుకు కారణం కావచ్చని ప్రాథమికంగా వైద్యులు, పోలీసులు భావిస్తున్నారు. లారీ యజమాని శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కందిపప్పు కేరాఫ్ వినుకొండ

- ప్రభుత్వ పథకం ఏదైనా వినుకొండ కందిపప్పుకే ప్రాధాన్యం
- దేశంలోని పలు ప్రాంతాలకు ఎగుమతి
- వేలాది మంది కార్మికులకు ఉపాధి


ప్రభుత్వ పథకాలకు సిద్ధం చేసిన కందిపప్పు (ఇన్‌సెట్‌లో) జగనన్న గోరుముద్ద కందిపప్పు ప్యాకెట్



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్‌లో కందిపప్పు తయారీ పరిశ్రమకు వినుకొండ ప్రసిద్ధి గాంచింది. గత కొన్ని దశాబ్దాల నుంచి ఈ పరిశ్రమ అంచెలంచెలుగా విస్తరిస్తోంది. వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించడమే కాకుండా పరోక్షంగా రవాణా రంగం కూడా అభివృద్ధి పథంలో నడిచేందుకు దోహదం చేస్తుంది.

- ప్రభుత్వ పథకం ఏదైనా వినుకొండ నుంచి కందిపప్పు సరఫరా చేయడం వినుకొండ దాల్ మిల్లుల ప్రత్యేకత.
- వినుకొండలో 24 దాల్ మిల్లులు ఉండగా అందులో 1200మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు.
- రవాణాకు ఉపయోగించే లారీలు కందిపప్పు మిల్లులపై ఆధారపడి ఉన్నాయి. నెలకు 150 లారీల వరకు సరుకు రవాణాకు ఉపయోగిస్తున్నారు.
- ప్రతిరోజు 100 మెట్రిక్ టన్నుల కందిపప్పు ఎగుమతి చేస్తారు.
- జిల్లాలో వినుకొండ తరువాత దుర్గి–17, మాచర్ల–13 కందిపప్పు మిల్లులతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.
- ప్రభుత్వ పథకాలకు తయారుచేసే కందిపప్పు ప్రభుత్వం నుంచి కందులు మిల్లులకు సరఫరా చేస్తారు. దీనికిగాను 100 కేజీల కందులకు 68.5 కేజీలు ప్రభుత్వ పథకాలకు సరఫరా చేస్తారు.
- ఒక ఏడాదిలో 30 వేల క్వింటాళ్లకు పైగా ఇతర ప్రాంతాల నుంచి కందులు కొనుగోలు చేయడం జరుగుతుంది.
- అంతేకాకుండా జాతీయ ప్రజా పంపిణీ పథకం , నాఫెడ్, మార్క్‌ఫెడ్ వంటి సంస్థలకు ఇక్కడి నుంచి కందిపప్పు సరఫరా చేస్తారు.
- ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పథకాలకు ప్రాంతాల వారీగా వైజాగ్, విజయవాడ, గుంటూరుతో పాటు ట్రేడర్స్‌తోపాటు వినుకొండకు చెందిన ఐదు మిల్లులు ప్రభుత్వానికి కందిపప్పు సరఫరా చేస్తున్నారు.
- జగనన్న గోరుముద్ద, విద్యార్థులకు అందజేసే కందిపప్పు, పౌరసరఫరాల శాఖకు కూడా ఇక్కడి నుంచే కందిపప్పు సరఫరా అవుతుంది.
- దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఎక్కడ టెండర్లు దక్కించుకున్నా వినుకొండ నుంచే కందిపప్పు సరఫరా జరగడం విశేషం.
- అనంతపురం, కడప, రాయలసీమ ప్రాంతం తోపాటు తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు వినుకొండ కందులను కొనుగోలు చేస్తూ పరోక్షంగా రైతులకు మేలు చేకూరుస్తున్నారు.

ఒడుదొడుకుల్లో పరిశ్రమ

వినుకొండ ప్రాంతంలో కందిపప్పు తయారీ పరిశ్రమ రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచినప్పటికీ చాలా మంది మిల్లుల యజమానులు వ్యాపారం సక్రమంగా నడవకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఐదుగురు మాత్రమే టెండర్లు దక్కించుకోగా వారికి అనుకూలమైన వారికి, వారు నిర్ణయించిన ధర ప్రకారం కందిపప్పును సరఫరా చేస్తున్నారు.

- కందిపప్పు సరఫరా విషయంలో ప్రభుత్వం నిబంధనలు చిన్న వ్యాపారస్తులకు వర్తించకపోవడంతో వారు ఒక్కోసారి నష్టాల బారిన పడుతున్నారు.
- మినిమమ్ రూ.100 కోట్లు టర్నోవర్ ఉన్న మిల్లులకు, ట్రేడర్స్‌కు మాత్రమే ప్రభుత్వ టెండర్లలో పాల్గొనే అవకాశం ఉండేలా నిబంధనలు ఉండటంతో చిన్న వ్యాపారులు టెండర్లలో పాల్గొనలేకపోతున్నారు. దీంతో మిల్లులు మొత్తం కొంతమంది చేతుల్లోనే నడవాల్సిన దుస్థితి ఏర్పడింది.

టెండర్ ప్రక్రియ సవరించాలి



రాష్ట్రంలోనే వినుకొండ కందిపప్పు మిల్లులకు ప్రసిద్ధిగాంచింది. ఇక్కడి కందిపప్పు దేశవ్యాప్తంగా సరఫరా జరుగుతున్నాయి. అయితే కొన్ని సందర్భాల్లో లాభాలతోపాటు నష్టాలు కూడా రావడంతో రానురాను కందిపప్పు పరిశ్రమ ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. ప్రభుత్వానికి సరఫరా చేసే కందిపప్పు టెండర్ల విషయంలో కొంతమంది మిల్లర్స్‌కు మాత్రమే టెండర్లలో పాల్గొనే విధంగా అధికారులు నిబంధనలు సవరించడంతో చాలామంది చిన్నాచితక వ్యాపారులు టెండర్లలో పాల్గొనలేకపోతున్నారు. కేవలం వినుకొండలో ఐదుగురు మాత్రమే టెండర్లు దక్కించుకోవడంతో మిగతా మిల్లర్లు నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని ప్రాంతాల వ్యాపారులకు న్యాయం జరిగేలా టెండర్ ప్రక్రియను సవరించకపోతే రానున్న రోజుల్లో కందిపప్పు పరిశ్రమ దెబ్బతినే అవకాశం ఉంది.

–పెండెల పుల్లారావు, ఆంధ్రప్రదేశ్ దాల్‌మిల్లర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

పోలీసు విభాగానికి అందించిన సేవలు మరువలేం

- ఎస్పీ మలికా గార్గ్
- ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుళ్లకు సన్మానం


ఎస్ఐ మోహనరెడ్డి, ఏఎస్ఐ ప్రసాదరావులను సన్మానిస్తున్న ఎస్పీ మలికా గార్గ్

నరసరావుపేట: పోలీసు విభాగానికి ఉద్యోగులుగా పోలీసులు చేసే సేవ కొనియాడదగినవని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగ విరమణ చేసిన జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఏ.మోహనరెడ్డి, నకరికల్లు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాదరావు, చిలకలూరిపేట రూరల్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావులను వారి కుటుంబ సభ్యులతో కలిసి శాలువా కప్పి పూలదండలు వేసి ఘనంగా సన్మానం చేసి జ్ఞాపిక అందజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వీరు డిపార్ట్‌మెంట్‌కు చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. వారి భావి జీవితం నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో తులతూగాలని మనస్ఫూర్తిగా కోరుతూ హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియచేశారు. డిపార్ట్‌మెంట్ పరంగా ఏ అవసరం ఉన్నా స్వయంగా వచ్చి తనను కలవవచ్చని భరోసా ఇచ్చారు. అదనపు ఎస్పీ అడ్మిన్ ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, అడ్మిన్ స్పెషల్ ఆఫీసర్ రామారావు, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, ఏపీ పోలీసు అధికారుల సంఘం పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ బి.మణిక్యాలరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

- అండర్–19 బాలుర క్రికెట్ పోటీలు
- కృష్ణా జట్టు శుభారంభం
- సెంచరీలతో చెలరేగిన కృష్ణా బ్యాట్స్‌మెన్లు


శ్రీనిత్యం 127 పరుగులు


వరుణ్‌సాత్విక్ 108 పరుగులు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో ఆంధ్ర సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల అండర్–19 బాలుర క్రికెట్ పోటీలు శుక్రవారం ఏసీఏ, ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు తలపడగా కృష్ణా జట్టు 206 పరుగుల భారీ తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన కృష్ణా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టానికి 385 పరుగుల భారీ స్కోర్ సాధించింది. కృష్ణా జట్టు బ్యాట్స్‌మెన్లు శ్రీనిత్యం 91 బంతుల్లో 127, వరుణ్‌సాత్విక్ 68 బంతుల్లో 108 పరుగులతో సెంచరీలు సాధించారు. మరో బ్యాట్స్‌మెన్ ఖాజా మొహిద్దీన్ 99 పరుగుల వద్ద పెవిలియన్ బాట పట్టి సెంచరీ చేజార్చుకున్నాడు. ప్రకాశం జట్టు బౌలర్ జయంత్‌కు మూడు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు ఏ దశలోనూ లక్ష్య సాధన దిశగా పరుగులు సాధించలేక 179 పరుగులకే కుప్పకూలింది. ప్రకాశం బ్యాట్స్‌మెన్లు రిలాసరెడ్డి 40, ఎస్.అభిల్ 39 పరుగులు సాధించారు. కృష్ణా జట్టులోని బి.గిరీశ్ 4, వరుణ్‌సాత్విక్ రెండు వికెట్లు సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పుష్పరత్నారావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

టిడ్కో ఇళ్ల వద్ద తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

పైప్‌లైన్లను పరిశీలించిన కమిషనర్ నిర్మల్‌కుమార్


స్థానికులను అడిగి సమస్య తెలుసుకుంటున్న కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్‌కుమార్

మంగళగిరి: స్థానిక ఆటోనగర్‌లోని వైఎస్సార్ జగనన్న కాలనీ(టిడ్కో) నివాసాలకు తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ డి.నిర్మల్ కుమార్ తెలిపారు. శుక్రవారం తాగునీటి సమస్య తలెత్తడంతో వెంటనే కమిషనర్ టిడ్కో నివాసాల సందర్శించి సమస్యను తెలుసుకుని పరిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ మోటారు కాలిపోవడం వల్ల టిడ్కో నివాసాలకు తాగునీటి సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడిందన్నారు. వెంటనే ఇంజినీరింగ్ విభాగం వారితో మరమ్మతులు చేయించి నీరు సరఫరా చేశామన్నారు. అవసరమైతే కొత్త మోటారు కొని అమర్చుతామన్నారు. బ్లాకుల వద్ద పైపులైను వాల్వులను పరిశీలించారు. ఏ బ్లాక్ వారు ఆ బ్లాక్‌లో వాల్వ్‌లను సొంతంగా ఆపరేట్ చేసుకుంటుండడంతో మిగిలిన బ్లాక్‌లకు సరిగా నీరు అందడం లేదన్నారు. ఈ సమస్య తలెత్తకుండా బ్లాక్ వారీగా సమయం కేటాయించి నీటిని సరఫరా చేసి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఏఈ లక్ష్మీపతిరాజు, డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రంగస్థల నటుడు కృష్ణేశ్వరరావుకు సత్కారం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై అక్కిరాజు ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రంగస్థల సినీ నటుడు వై.ఎస్.కృష్ణేశ్వరరావును సత్కరించారు. రచయిత, నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ స్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, సనాతన ధర్మ ప్రచారకుడు యాబలూరి లోకనాథశర్మ, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ, కార్యదర్శి చంద్రప్రగడ శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్.మస్తానయ్య, బొల్లా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి అంకా సూర్యనారాయణ, ప్రముఖ రంగస్థల నటుడు కావూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం


హనుమాన్ విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు

అమరావతి: హనుమత్ జయంతి వేడుకలలో భాగంగా శుక్రవారం తొలిరోజు మండల పరిధిలోని మల్లాది ద్రాంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భవిరెడ్డి హనుమంతరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకటరమణాచార్యులు తొలుత 40 అడుగుల అభయాంజనేయ స్వామి వారికి పంచామృత స్నపన, ప్రత్యేక తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం ద్రాంజనేయస్వామి వారికి మన్యుసూక్తయుత పంచామృత స్నపన, సహస్ర నామార్చన, తమలపాకులతో ఆకుపూజలు నిర్వహించారు. భక్తులకు విసన కర్రలను, మామిడిపండ్లు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త బి.హనుమంతరావు మాట్లాడుతూ శనివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 9గంటలకు విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. మహిళా మండలి వారిచే హనుమాన్ చాలీసా పారాయణం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేస్తామని తెలిపారు. భక్తులందరూ స్వామి వారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగిసిన ఖోఖో వేసవి శిక్షణ శిబిరం


శిక్షణ పొందిన క్రీడాకారులతో గ్రామస్తులు, అధికారులు

జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. మండల పరిధిలోని పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నెల రోజుల నుంచి స్పోర్ట్ అథారిటీ ఆంధ్రప్రదేశ్ అనుమతితో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో పురుషుల ఖోఖో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి సుమారు 75 మంది బాలురు, పురుషులు పాల్గొన్నారు. ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ, (గ్రామస్తులు), పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.1.50 లక్షల వ్యయంతో శిబిరం నిర్వహించినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పంగులూరు ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు క్రీడాకారులు ఉద్దేశించి మాట్లాడారు. వేసవిలో సమయాన్ని వృథా చేయక క్రీడా ప్రాధాన్యత వల్ల బాలురకు, శిక్షణకు పంపిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి బాపట్ల జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కె. పాల్‌కు మార్ మాట్లాడుతూ పంగులూరు అంటేనే ఖోఖో క్రీడ గుర్తుకు వస్తున్నాయన్నారు. 252 క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. శిక్షణకు పూర్వ క్రీడాకారులు బొద్దులూరి హరిబాబు (యూఎస్ఏ), ఐ.సోమశేఖర్‌రెడ్డి (గ్రామ సచివాలయం), శ్రీనివాసరెడ్డి (పీఈటీ), మేకా వెంకటేశ్వర్లు (పీఈటీ), కుక్కపల్లి వెంకట్రావు (సీఐ) రూ. 25 వేలు ఆర్థిక సాయం చేశారు. మిగిలిన ఖర్చులు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ అందించినట్లు తెలిపారు. ఎస్ఆర్ స్పోర్ట్స్ తరఫున 45 మందికి క్రీడా దుస్తుల్ని నల్లమల్లి శ్రీరామలురెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె ఉషారాణి (అడ్వకేట్) బహూకరించారు. వారికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు బాపట్ల కోచ్ కొప్పురావూరి పాల్ (డీఎస్ఏ) శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పంగులూరు కళాశాల మాజీ అంతర్జాతీయ క్రీడాకారుడు భవనం కాశీవిశ్వనాథరెడ్డి, గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు రాయిని ప్రమీల, వెంకట సుబ్బారావు, క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

చికిత్స పొందుతూ మాజీ సైనికుడి మృతి

బాపట్ల టౌన్: చికిత్స పొందుతూ మాజీ సైనికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వేటపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కావూరి సుబ్బ హ్మణ్యంరెడ్డి ఐదేళ్లపాటు వీరాల సమీపంలో హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి శుక్రవారం సైనిక సంక్షేమ సంఘం సభ్యులు జాతీయ జెండాను కప్పి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు సుంకర శేషగిరిరావు, బాపట్ల మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, సీనియర్ మాజీ సైనికులు డి. వెంకటేశ్వర్లు, సీహెచ్. కృష్ణారావు, భక్తా రామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పోతురాజు రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, నంగు రాంప్రసాద్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషురెడ్డి పాల్గొన్నారు.

భవిత పాఠశాలలకు ప్రభుత్వం పెద్దపీట

జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న

జంపని(వేమూరు): ప్రభుత్వం భవిత పాఠశాలలకు పెద్దపీట వేస్తోందని జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న అన్నారు. మండలంలోని జంపనిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0–18 ఏళ్లలోపు పిల్లల్ని సర్వే చేస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీతో పాటు విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్సులు అందిస్తోందని, వాటిని తల్లిదండ్రులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లల్ని గుర్తించడానికి మే ఒకటో తేదీ నుంచి ప్రత్యేక సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను పరిశీలిస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో వి. మోహనరాజు, యస్. విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఏపీఈసెట్‌లో ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ విద్యార్థులతో బీటెక్‌లోకి ప్రవేశం కల్పించే ఏపీ ఈసెట్ ఫలితాల్లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ బ్రాంచ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల కరస్పాండెంట్ చెరుకు రామకృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన రావిరెడ్డిపాలెంలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణమూర్తి మాట్లాడుతూ తమ విద్యార్థులు సీఎస్ఈ విభాగంలో పి.శ్రీకృత రాష్ట్రస్థాయిలో 77వ ర్యాంకు, పొట్ల అక్షయ శ్రీ 194వ ర్యాంకు, మిర్యాల దీప్తిక 218వ ర్యాంకు, ఈసీఈ విభాగంలో కె. భావన 1006వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్ విభాగం నుంచి 85 మంది విద్యార్థులు ఈసెట్‌కు హాజరు కాగా, వారిలో 83 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి. విజాక్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, విభాగాధిపతులు డి. రమాదేవి, వల్లా జ్యోతిర్మయి పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు విదేశీ విద్యా రుణాలు


రుణ పత్రాలు అందుకున్న విద్యార్థులు యూనియన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది

కొరిటెపాడు: గుంటూరు యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు విదేశీ విద్యా రుణ మంజూరు పత్రాలను బ్యాంకు అధికారులు అందించారు. బ్యాంకు రీజినల్ హెడ్ ఎస్.ఆంజనేయులు మాట్లాడుతూ రూ.40 లక్షల వరకు ఎటువంటి సెక్యూరిటీ అవసరం లేకుండా విదేశీ విద్యా రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వారికి యూనియన్ బ్యాంకు ఎల్లప్పుడూ సహకారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. డిప్యూటీ రీజినల్ హెడ్ అశ్వర్ణనాయక్, ఎ.రాజేష్, రిటైల్ రుణ పాయింట్ హెడ్ జె.రామాంజనేయకుమార్ పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు అభిప్రాయాలను వెల్లడించారు. అతి తక్కువ వడ్డీ రేటుతో సకాలంలో రుణం మంజూరు చేసిన బ్యాంకు ప్రతినిధులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

శింగరకొండ ఆలయంలో అధునాతన వంటశాల ప్రారంభం

స్టీమ్ పరికరాలు అందించిన ఎస్‌బీఐ


వంటశాలను ప్రారంభిస్తున్న స్టేట్ బ్యాంకు జనరల్ మేనేజర్ సురేశ్వరరావు

అద్దంకి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి భోజనశాలకు నూతనంగా శంకుస్థాపన చేసిన సీఎస్ఆర్ యాక్టివిటీ కింద అద్దంకి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ స్టీమ్ పరికరాలు అందజేసింది. ఆధునిక వంటశాలను శుక్రవారం స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ సురేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి టి. సుభద్ర మాట్లాడుతూ దేవాదాయశాఖ ఆదేశాల మేరకు ప్రస్తుతం శింగరకొండలో శని, మంగళవారాల్లో రోజుకు 500 మందికి, మిగిలిన రోజుల్లో 150 నుంచి 200 మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎక్కువ మందికి చేయాల్సి వస్తే ఈ స్టీమ్ కుక్కర్లు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. ఎస్‌బీఐ అందజేసిన ఒక్కో కుక్కర్‌లో ఒక్కో దానిలో 25 కిలోల బియ్యం 15 నుంచి 20 నిమిషాల్లో అన్నంగా తయారవుతుందని వివరించారు. మూడు కుక్కర్ల సాయంతో 75 కిలోల బియ్యాన్ని అన్నంగా తయారు చేసుకోవచ్చని తెలిపారు. మిగిలిన రెండింటిని కూరలు తయారు చేసుకోవడానికి వినియోగించనున్నట్లు ఆయన వెల్లడించారు. 20 నిమిషాల్లో 500 మందికి అన్నదానం చేయగలిగిన కిచెన్ పరికరాలను అందజేసిన అందజేసిన స్టేట్‌బ్యాంకు యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.